# అభివృద్ధి చేస్తా ..ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ కుటుంబ సభ్యులే నా బలం, బలగం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దు
- గడపగడపకూ కేసీఆర్ సంక్షేమ పథకాలు
- ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

మాక్లూర్, అక్టోబర్ 26: తనను మళ్లీ ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముల్లంగి(బి), బోంకన్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి గురువారం ప్రజాశీర్వాద యాత్రలో భాగంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బైక్ ర్యాలీలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం బహిరంగ సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏండ్లలో రెండు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముల్లంగి(బి) గ్రామంలో 68 మంది కురుమ, గొల్లలకు గొర్రెల పథకం అందించామని తెలిపారు. గ్రామపంచాయతీ భవనానికి 25 లక్షలు మంజూరు చేశానని తెలిపారు. బెస్త కులస్తులకు , కుర్మ గొల్లలకు మాల, మాదిగ కులాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశానన్నారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందించానన్నారు. రూ.12 కోట్లతో బోంకన్‌పల్లి, ముల్లంగి(బి), గుత్ప ఎత్తిపోతల పథకానికి సీఎం కేసీఆర్ ద్వారా నిధులు మంజూరు చేయించి రైతులకు సాగునీరందేలా కృషి చేశానన్నారు. పెద్ద చెరువు, చింతల చెరువు, మల్లె చెరువుకు మిషన్ కాకతీయ పథకం ద్వారా రూ.కోటి 50లక్షలు మంజూరు చేసి అభివృద్ధి చేయడంతో ఆయకట్టు కింద వందలాది ఎకరాలు సాగులోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గ్రామాలకు వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన కులసంఘాల భవనాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు పావనీ శ్యాంరావు, గంగామణి, ఎంపీటీసీ పూజిత, ఎంపీపీ మాస్త ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు సత్యం, విండో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూరోల్ల అశోక్, శ్యామ్‌రావు, ఉపసర్పంచ్ సాయిలు, గోపాల్, రంజిత్, భూషణ్, భోజన్న, సాయిలు, సాగర్‌రావు, రమేశ్, అమృత్, ప్రవీణ్‌యాదవ్, నవీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆలూర్ మండలంలోని గుత్ప, గుత్ప తండా గ్రామాల్లో ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామస్తులు, బతుకమ్మలు, బోనాలతో జీవన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు.


గుత్ప ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి


సభాస్థలంలో ట్రాక్టర్ నడుపుతున్న జీవన్‌రెడ్డి

## సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్, అక్టోబర్26: పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో వచ్చేనెల 3న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా సీఎం కేసీఆర్ ఆర్మూర్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. బహిరంగ సభకు భారీ ఎత్తున్న ప్రజలు వస్తున్న నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. జీవన్‌రెడ్డి స్వయంగా జేసీబీ, ట్రాక్టర్లను నడుపుతూ సభా ప్రాంగణాన్నా శుభ్రం చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, పోల మధుకర్, పీసీ గంగారెడ్డి, మహేందర్, చింటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా హనుమాన్ జాతర

ఆర్మూర్, అక్టోబర్26: మండలంలోని మిర్ధాపల్లి గ్రామంలో హనుమాన్ మందిరంలో హనుమాన్ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సాహల్లో చివరి రోజు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన సత్రంలో భోజనం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులతో జీవన్‌రెడ్డి ముచ్చటించారు.

## ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డిని గెలిపించాలి ..


చేపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్, అక్టోబర్26: చేపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం ఆర్మూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఓటు చేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, ఆర్మూర్ జడ్పీటీసీ మెట్టు సంతోష్, బీఆర్ఎస్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఈ గంగాధర్, పిప్రి ఎంపీటీసీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాటాపూర్‌కు ఎమ్మెల్యే షకీల్ రాక

రెంజల్, అక్టోబర్ 26: సాటాపూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమయా గార్డెన్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి బోధన్ ఎమ్మెల్యే షకీల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని సర్పంచ్ వికార్‌పాషా, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు హాజీఖాన్, ఎంపీటీసీ హైమద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ఆర్మీ జవాన్ కుటుంబానికి సన్మానం

బోధన్ రూరల్, అక్టోబర్ 26: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేర మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కొన్ని రోజుల క్రితం వరదలో ఆర్మీజవాన్ మృతి చెందగా బాధిత కుటుంబంతోపాటు రిటైర్డ్ మిలటరీ అధికారి పల్లె సుభాష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఈసీ అల్తాఫ్ హైమద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాగేపల్లిలో సీఎం బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం


సీఎం బ్రేక్ ఫాస్ట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం నరేంద్రశేఖర్

రెంజల్, అక్టోబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని గురువారం బాగేపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నరేంద్ర శేఖర్, ఎస్‌ఎంసీ చైర్మన్ బేగరి ఇందు ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ... రుచికరమైన బ్రేక్ ఫాస్ట్‌ను పాఠశాలలో అందించడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యాయుడు సురేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 30న డాక్టర్ మధుశేఖర్‌కు అభినందన సభ


మాట్లాడుతున్న దళిత ఐక్యసంఘటన నాయకులు

భీమ్‌గల్, అక్టోబర్ 26: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు మధుశేఖర్‌ను ఇటీవల హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించిన సందర్భంగా ఈనెల 30న మధుశేఖర్‌కు అభినందన సభ నిర్వహించనున్నట్లు దళిత ఐక్య సంఘటన మండల అధ్యక్షుడు గడాల ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలో గడాల ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీఎస్‌ఎంఐఎస్‌డీసీ చైర్మన్ ఎర్రొల్ల శ్రీనివాస్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి, సమతా సైనిక్ దళ్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు రెంజర్ల రాజేశ్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల సభ్యులు తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, పర్సనల్ దళిత ఐక్య సంఘటన నాయకులు మహేశ్, రంజిత్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

## ‘ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు’


బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, నాయకులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో రాజా గౌడ్

శక్కర్‌నగర్, అక్టోబర్ 26: అసెంబ్లీ ఎన్నికల నిర్వహించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని బోధన్ ఆర్డీవో రాజా గౌడ్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పలు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో పలు సూచనలు చేశారు. డివిజన్‌లోని అధికారులు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అవసరమైన చోట్ల ఆయా శాఖల సహకారం తీసుకోవాలని అన్నారు. నిత్యం విధుల కేటాయించిన అధికారులు ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ కె.గంగాధర్, ఏవో విఠల్, ఎడపల్లి ఎంపీడీవో గోపాల కృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ


బాగేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రెంజల్, అక్టోబర్ 26: వానకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమ చేస్తామని ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం భాస్కర్ అన్నారు. గురువారం బాగేపల్లి, దండిగుట్ట, నీలా, రెంజల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతు తమ పట్టదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను సకాలంలో అందించాలని సూచించారు. క్వింటాలు ‘ఏ’ గ్రేడ్ రకం ధర రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 మద్దతు ధర అందిస్తామని తెలిపారు. జీపీ కార్యదర్శులు శ్రీకాంత్, గౌతమి, సీసీలు శివ, రాజయ్య, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి మాధవి, గ్రామ అధ్యక్షురాలు లక్ష్మి, సౌజన్య, సుచరిత, నిర్మల, సీఏలు పాల్గొన్నారు.